సాక్షి
వికారాబాద్

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



మౌలిక వసతులు కల్పిస్తాం

కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యాటకులకు మౌలిక వసతులు కల్పిస్తామని సీసీఎఫ్ సైదులు ప్రకటించారు. 8లో▸



ప్రజా సంక్షేమమే లక్ష్యం

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 8లో▸



సిరుల సాగు

తక్కువ విస్తీర్ణం, స్వల్ప పెట్టుబడితో పూల సాగు లాభాల పంట పండిస్తోంది. దీంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్స్

తాండూరు టౌన్: ఈ నెల 27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ సెలక్షన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.మధు, సహాయ కార్యదర్శి రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని పాత శాలివాహన కళాశాల మైదానంలో అండర్‌-14,16 విభాగంలో రన్నింగ్, లాంగ్ జంప్, షాట్‌పుట్ క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. పోటీలకు హాజరయ్యే వారు జనన ధ్రువీకరణ పత్రం తప్పక తీసుకురావాలని సూచించారు. 19వ జాతీయ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్ సందర్భంగా ఈ ఎంపిక నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. మరిన్ని వివరాలకు 8978234447, 6300075229 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

కొడంగల్ విద్యార్థికి గోల్డ్‌మెడల్

జాతీయ స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికైన కిరణ్



కిరణ్‌కు బహుమతి అందజేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కొడంగల్ రూరల్: రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థి కిరణ్ బంగారు పతకం సాధించారు. శనివారం కామారెడ్డిలో నిర్వహించిన క్రాస్ కంట్రీ 15 వందల మీటర్ల పరుగు పందెం పోటీల్లో విజయం సాధించిన కిరణ్ బీహార్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ తిప్పన్న సాయిరెడ్డి తెలిపారు. హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో విద్యార్థి కిరణ్ అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నాడని.. శిక్షణ సమయంలోనే రాష్ట్ర స్థాయిలో విజయం సాధించడం విశేషమని అన్నారు. కాగా విజేతలకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బహుమతులు అందజేశారు.

నీటి తడులతో దిగుబడి పెంపు

జిల్లా వ్యవసాయాధికారి గోపాల్



పరిశీలిస్తున్న డీఏఓ గోపాల్

అనంతగిరి: వికారాబాద్ మండల పరిధిలోని నారాయణపూర్, ఆలంపల్లి తదితర గ్రామాల్లో శనివారం జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. యాసంగిలో విత్తిన శనగ పంటకు 35-40 రోజులకు, 55-65 రోజులకు తేలికపాటి నీటి తడి ఇస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. రైతులుతప్పకుండా వ్యవసాయాధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడి సాధించాలన్నారు. ఆయన వెంట ఏఈఓ అనిల్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

30 వరకు 'క్లాసికల్ స్వైన్ ఫీవర్' నిర్మూలన టీకా

జిల్లా పశువైద్యాధికారి అనిల్‌కుమార్



టీకా వేస్తున్న పశు వైద్యాధికారులు

వికారాబాద్ అర్బన్: పందుల యజమానులు మూడు నెలలు నిండిన జంతువులకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాధి నిర్మూలన టీకా తప్పక వేయించాలని జిల్లా పశువైద్యాధికారి అనిల్ కుమార్ అన్నారు. శనివారం ఆయన పట్టణ సమీపంలోని పందుల పెంపకం షెడ్లలో టీకా వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 వరకు టీకాల కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ వ్యాధి బారిన పడిన పందుల్లో జ్వర తీవ్రతతో పాటు కళ్లు ఎర్రబడి నీరసం చెందుతాయన్నారు. నరాల బలహీనతతో నడకలో మార్పు వచ్చి జంతువులు మృత్యువాత పడతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 9,940 పందులు ఉన్నాయన్నారు. ఆయన వెంట ఏడీ డాక్టర్ ప్రహ్లాద్, సిబ్బంది హాజీ, జగన్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్ రూరల్: మాడ వీధుల్లో వేంకటేశ్వర స్వామి వారి ఊరేగింపు

వైకుంఠ వైభవం

వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జాము నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు క్యూ కట్టారు. గోవింద నామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. ఎటు చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్, వికారాబాద్



తాండూరు రూరల్: చంద్రగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల క్యూ

'నేవీ రాడార్'కు కదలిక

హిందూ మహా సముద్రంలో సంచరించే నౌకల కదలికలు.. సంకేతాలను గుర్తించేందుకు దామగుండం అడవుల్లో ఏర్పాటు చేయనున్న నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు కదలిక వచ్చింది. ఐదేళ్ల క్రితమే పూర్తికావాల్సిన పనులు ప్రభుత్వం మారడంతో నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేసేందుకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకుటోంది.

ఐదేళ్ల క్రితం నిలిచిన పనులు

- రూ.133 కోట్లకు 2700 ఎకరాల భూమి అప్పగించేందుకు రిజర్వ్ ఫారెస్ట్ అంగీకారం
- గతంలోనే మెజార్టీ అనుమతులు పూర్తి
- బీఆర్‌ఎస్ హయాంలో నిలిచిన పనులు
- 'లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ స్టేషన్' ఏర్పాటుకు అడుగులు
- ఇటీవలే స్థల పరిశీలన చేసిన కలెక్టర్



నేవీ రాడార్ కేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

వికారాబాద్: జిల్లాకే తలమానికం కానున్న జాతీయ ప్రాజెక్టు ఏర్పాటుకు విఘ్నాలు తొలగినట్టే కనిపిస్తున్నాయి. దేశ రక్షణ కోసం 'లో ఫ్రీక్వెన్సీ రాడార్'స్టేషన్ ఏర్పాటు చేయాలని అప్పటి యూపీఏ ప్రభుత్వం నిర్ణయించింది. ఐదేళ్ల క్రితమే తుదిదశకు చేరుకున్నాయనుకుంటున్న సమయంలో పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఇండియా నేవీ రాడార్ వ్యవస్థకు సంబంధించిన ఈ ప్రాజెక్టును పూడూరు మండలం దామగుండం సమీపంలో ఏర్పాటుకు ఏడేళ్ల క్రితమే సన్నాహాలు ప్రారంభించారు.

మరుగున పడిన ప్రక్రియకు ఎమ్మెల్యే చొరవ

ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలోని 2,700 ఎకరాల భూమిని నేవీ సంస్థకు అప్పగించేందుకు అంగీకరించారు. ఫారెస్ట్ అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక పంచాయతీల నుంచి పలు ఒప్పందాలు సైతం పూర్తయ్యాయి.గడిచిన ఐదేళ్లలో ప్రాజెక్టు ప్రక్రియ మరుగున పడింది. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వంతోనే విఘ్నాలు తొలగడం లేదనే విమర్శలు వచ్చాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ప్రాజెక్టు ఏర్పాటుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఈ విషయంలో పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని కలెక్టర్, పలువురు అధికారులతో చర్చలు పూర్తి చేశారు. ఇందులో భాగంగా శుక్రవారం కలెక్టర్ నారాయణరెడ్డి దామగుండ అటవీ ప్రాంతాన్ని సందర్శించారు.

అంచనా వేసినా ఆరంభించని పనులు

దామగుండం సమీపంలో ఏర్పాటుచేయ తలపెట్టిన లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటునకు రూ.1900 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందుకు సంబంధించి జాతీయ, రాష్ట్రస్థాయిలో 16 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉండగా, దాదాపుగా అన్ని అనుమతులు వచ్చాయి. పూడూరులోని దామగుండం నుంచి పరిగి సమీపంలోని మల్లెమానిగూడ శివారు వరకున్న 2,700 ఎకరాల అటవీభూమి అవసరమవుతుందని నేవీ సంస్థ అంచనావేసింది. 2011-12లో ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించగా 2014లో ఈ ప్రాజెక్టు ఏర్పాటు విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఓ అంచనాకు వచ్చాయి. పనులు ప్రారంభ దశలో ప్రభుత్వం మారడంతో ఏర్పాటు ప్రక్రియ అర్ధంతరంగా నిలిచిపోయింది. జిల్లా పరిధిలోని పదిగ్రామాల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూ రుతుందని అంతా భావించారు.

రిజర్వ్ ఫారెస్టుకు రూ.133 కోట్లు చెల్లింపు

రాష్ట్ర రాజధానికి 60 కిలోమీటర్ల దూరంలో ఉండడంతో పాటుగా సముద్ర మట్టానికి 350కి పైగా మీటర్ల ఎత్తైన ప్రాంతాన్ని ఇండియన్ నేవీ ఎంచుకుంది. ఈ భూభాగం రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించినది కావడంతో పాటుగా పురాతన దామగుండ రామలింగేశ్వరాలయం ఉండడంతో తొలుత అడ్డంకులు ఏర్పాడ్డాయి. దీంతో నేవీ అధికారులు రిజర్వ్ ఫారెస్టుకు రూ.133 కోట్లు చెల్లించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని కొనసాగించడంతో పాటుగా గ్రామ సమీపంలో రూ.5కోట్లు వెచ్చించి మరో ఆలయం నిర్మిస్తామని ప్రజలతో నిర్వహించిన సమావేశంలో హామీ ఇచ్చారు.

ఆ ప్రాంతాన్ని పరిశీలించాం

సీసీఎల్‌ఏ సూచనల మేర కు రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతా న్ని పరిశీలించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూముల వివరాలు ఇవ్వాలని అడిగారు. అందుకే ఇటీవల ఆ ప్రాంతాన్ని సందర్శించాం. త్వరలోనే ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాం. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ముందుకు వెళ్తాం.

– నారాయణరెడ్డి, కలెక్టర్, వికారాబాద్



మళ్లీ కలకలం

గ్రేటర్‌లో వారంలో 36 కోవిడ్ కేసులు

- హైదరాబాద్‌లో 33, రంగారెడ్డిలో 3
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ
- అనుమానితులకు పరీక్షలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వాక్సినేషన్ తర్వాత పూర్తిగా కనుమరుగైపోయిందని భావించిన కరోనా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా వారం రోజుల్లోనే 38 పాజిటివ్ కేసులు నమోదు కాగా, వీటిలో గ్రేటర్ పరిధిలోనే 36 రికార్డు కావడం ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ జిల్లాలో 33, రంగారెడ్డి జిల్లాలో మరో మూడు కేసులు నమోదయ్యాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కరోనా వైరస్ ఎప్పటికప్పుడు కొత్తగా రూపాంతరం చెందుతోంది. ఇప్పటికే అనేక మంది మృత్యువాతకు కారణమైన వైరస్ మళ్లీ పంజా విసురుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. వైరస్ ఉధృతి నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. చికిత్స కోసం గాంధీ కోవిడ్ ఐసోలేషన్ వార్డుల్లో 50 ఆక్సిజన్, వెంటిలేటర్ పడకలను సిద్ధం చేసింది. నిలోఫర్ సహా ఇతర అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమానితులకు వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఇన్‌పేషంట్ చికిత్సల కోసం పడకలు సిద్ధం చేసింది. అవసరమైతే కొంతకాలంగా సర్వీసుకు దూరంగా ఉన్న టిమ్స్‌ను పునరుద్ధరించాలని నిర్ణయించింది. కోవిడ్ ఉధృతి నేపథ్యంలో పలు ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు ఆంక్షలు అమలు చేస్తున్నాయి. విద్యార్థులకు మాస్క్, శానిటైజర్ల తప్పనిసరి చేశాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు,పోలీసు స్టేషన్లలోనూ మాస్క్ మస్ట్ చేయడంతో మార్కెట్లో మళ్లీ వాటికి డిమాండ్ ఏర్పడింది.

రూపాంతరం చెందుతూ..

ప్రపంచాన్ని గడగడలాండించిన కరోనా వైరస్ తొలిసారిగా 2019 డిసెంబర్ 31న చైనాలోని వూహాన్‌నగరంలో వెలుగు చూసింది. ఆ తర్వాత 2020 మార్చి 2న హైదరాబాద్ నగరంలో తొలి కోవిడ్ కేసు నమోదైంది. మొదటి వేవ్‌లో కోవిడ్ ఆల్ఫా వేరియంట్ విజృంభించగా, రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్, మూడో వేవ్‌లో ఒమిక్రాన్ వేరియంట్ వెలుగు చూసింది. కొత్తగా ఒమిక్రాన్ జేఎన్1 వేరియంట్ రూపంలో మళ్లీ విజృంభిస్తోంది. మొదటి, రెండో వేవ్‌ల్లో అనేక మంది కోవిడ్ బారిన పడి మృత్యువాతపడ్డారు. ఉపాధి అవకాశాలు కోల్పోయి అనేక కుటుంబాలు రోడ్డున పడాల్సి వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ ఒకవైపు బాధితులకు చికిత్సలు అందిస్తూనే మరోవైపు నియంత్రణ చర్యలు చేపట్టింది. లాక్‌డౌన్‌ను అమలు చేసి వైరస్ వ్యాప్తిని కొంత కట్టడి చేసింది. వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చింది. దశల వారీగా పదేళ్ల పైబడిన ప్రతి ఒక్కరికీ మూడు డోసుల వాక్సిన్ ఇప్పించింది. క్రమంగా వైరస్ తగ్గుముఖం పట్టడంతో అప్పటి వరకు అమల్లో ఉన్న ఆంక్షలను ఎత్తేసింది. ఇక కోవిడ్ పీడ విరగడైందని అంతా ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో చాపకింద నీరులా విస్తరిస్తోంది. దీంతో వైద్య ఆరోగ్యశాఖ ఎలాంటి విపత్కర పరిస్థితులెదురైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఏర్పాట్లు చేసింది. ఆస్పత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు, పడకలు, వైద్య సిబ్బందితో పాటు పీపీఈ కిట్లు, మాస్కులు, మందులు సిద్ధం చేసింది.

వారం రోజుల్లో నమోదైన కేసుల వివరాలు

తేదీ	హైదరాబాద్	రంగారెడ్డి
16	01	-
17	-	-
18	01	-
19	04	-
20	06	-
21	04	01
22	08	01
23	09	01



కళశాలకు పూజ చేస్తున్న అర్చకుడు

అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు

బంట్వారం: శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి కోట్‌పల్లి మండల కేంద్రానికి స్వామి వారి అక్షింతలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా శనివారం హిందూ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో స్థానిక శివాలయంలో 18 రాగి కళశాల్లో అక్షింతలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలన్నీ శ్రీరామ నామ జపం మార్మోగింది. అనంతరం సభ్యులు కోట్‌పల్లి మండల పరిధిలోని 18 పంచాయతీలకు రాగి కళశాలను ఇచ్చి భక్తులకు అక్షింతలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: క్రైస్తవుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక వైట్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో క్రైస్తవులకు క్రిస్మస్ కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రిస్టియన్, మైనార్టీలకు అండగా ఉంటుందన్నారు. క్రీస్తు బోధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజుగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, కౌన్సిలర్లు ప్రభాకర్‌గౌడ్, మమత తదితరులు పాల్గొన్నారు.



క్రిస్మస్ కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తెరపైకి తెలంగాణ పార్కు

జిల్లా కేంద్రంలో తెలంగాణ పార్కు నిర్మాణ ప్రతిపాదన మళ్లీ తెరపైకి వచ్చింది. గత ప్రభుత్వం విడుదల చేసిన నిధులను మళ్లించడంతో పార్కు నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమైంది. ఇటీవలే నిధులు విడుదల చేసిన నూతన ప్రభుత్వం త్వరితగతిన నిర్మించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదేళ్ల క్రితమే ప్రతిపాదనలు

- గ్రాఫ్‌కే పరిమితమైన నిర్మాణం
- టీయూఎఫ్‌ఐడీసీ నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
- అధికశాతం కేటాయించాలని వినతి

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రం వికారాబాద్‌కు ముక్కుపుడక లాంటి తెలంగాణ పార్కు ఏర్పాటు ఐదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైంది. గత ప్రభుత్వం పార్కు ఏర్పాటుకు స్థలం గుర్తించి వదిలేసిన విషయం తెలిసిందే. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అసెంబ్లీ స్పీకర్ పదవిలో ఉన్నారు. ఇటీవలే జిల్లా కేంద్రం అభివృద్ధికి తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్(టీయూఎఫ్‌ఐడీసీ) నిధులు మంజూరయ్యాయి. ఈ నిధుల నుంచి పార్కు నిర్మాణ పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేశ్ స్పీకర్‌ను కోరినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్‌కు సూచించారని వినికిడి. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు లేనందున స్పీకర్ జిల్లా కేంద్రంలోనే ఉండనున్నట్లు అధికారులు చెబుతున్నారు. క్రిస్మస్ వేడుకల అనంతరం పార్కు నిర్మాణంపై ఉన్నతాధికారులతో చర్చించనున్నట్లు తెలిసింది.



పార్కు నమూనా చిత్రం

నిధుల మళ్లింపుతో నిలిచిన పనులు

2019 జనవరి 29న అప్పటి కలెక్టర్ ఉమర్ జలీల్ తెలంగాణ పార్కు ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. జిల్లా కేంద్రానికి తాగునీరు అందించే శివారెడ్డిపేట్ చెరువు ముందు భాగంలో 13 ఎకరాల స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తే అనువుగా ఉంటుందని ప్రతిపాదించారు. 2020లో పార్కు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి లభించింది. ప్రభుత్వం టీయూఎఫ్‌ఐడీసీ కింద వికారాబాద్ అభివృద్ధికి రూ.20 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధుల నుంచి 25 శాతం పార్కు అభివృద్ధికే కేటాయించినట్లు ప్రచారం సాగింది. 2021 జూన్ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికే పార్కు పనులు పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నా ఒక్క అడుగు ముందుకు పడలేదు. అయితే ఇట్టి నిధులు అప్పటి పాలకులు, అధికారులు ఇతర అభివృద్ధి పనులకు మళ్లించడంతో పార్కు నిర్మాణం పనులు ప్రారంభించలేదనే ప్రచారం ఉంది.

పర్యాటకులు పెరిగే అవకాశం

హైదరాబాద్ నుంచి జిల్లా కేంద్రమైన వికారాబాద్ వచ్చే ప్రధాన రోడ్డు పక్కనే శివారెడ్డిపేట్ చెరువు ముందు భాగంలో ఈ పార్కు నిర్మిస్తే పర్యాటకులు పెరగడంతో పాటుగా స్థానికులకు ఉపాధి లభించే అవకాశాలున్నాయి. చెరువులో ఎప్పుడు నీరు ఉండటంతో పాటు, పట్టణానికి కొంత దూరంగా ఉండటం, హైదరాబాద్ ప్రధాన రోడ్డుకు పక్కనే ఉండటంతో పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే శని, ఆదివారాల్లో, సెలవు దినాల్లో అనంతగిరికి పర్యాటకులు పెద్ద ఎత్తున వస్తుంటారు. పర్యాటకులు వచ్చే ప్రధాన రహదారి వెంటే పార్కు నిర్మిస్తే జిల్లా కేంద్రానికి మరింత వన్నె వచ్చే అవకాశం ఉంది. అత్యాధునిక హంగులతో పార్కును ఏర్పాటు చేసేందుకు అధికారులు గతంలోనే ప్రణాళికలు తయారు చేశారు. పార్కును ఎలా తీర్చిదిద్దాలనే విషయంపై ఓ ప్రైవేటు కంపెనీ నమూనా గ్రాఫ్ తయారు చేసింది. ఈ తెలంగాణ పార్కులో ప్రత్యేకంగా చిన్న పిల్లల ఆటస్థలం వారు ఆడుకునేందుకు క్రీడా సామగ్రి ఏర్పాటు, స్విమ్మింగ్ పూల్, రెయిన్ డ్యాన్స్ ఏర్పాటుకు ప్రణాళిక తయారు చేశారు. ఆకట్టుకునే విధంగా గ్రీనరీ ఏర్పాటు, సుమారు వంద రకాల పూల మొక్కలు, పార్కు చుట్టూ ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేసి విద్యుత్ కాంతులతో మెరిసేలా ఏర్పాటు చేయాలని గ్రాఫ్‌లో పొందుపరిచారు. పార్కు నుంచి చెరువు అందాలు వీక్షించేందుకు కొంత ఎత్తులో నిచ్చెనలతో కూడిన ట్రాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. జిల్లా కేంద్రానికి ముక్కుపుడక లాంటి ఈ పార్కు నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వమైనా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తొలి ప్రాధాన్యత

పట్టణానికి అందాన్ని తీసుకొచ్చే తెలంగాణ పార్కు నిర్మాణం పూర్తి చేసేందుకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరాం. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. పార్కు నిర్మాణం పూర్తయితే మున్సిపల్‌కు ఆదాయంతో పాటు, స్థానికులకు ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం వచ్చిన టీయూఎఫ్‌ఐడీసీ నిధుల నుంచి పార్కుకు నిర్మాణానికి ఎక్కువ శాతం కేటాయించాలని స్పీకర్‌ను కోరాం.

– మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్, వికారాబాద్

క్లుప్తంగా

బైక్ ఢీకొని రైతు మృతి


చంద్రయ్య(ఫైల్)

పరిగి: పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తున్న ఓ వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గడిసింగాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన హరిజన చంద్రయ్య(58) ఉదయం పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా హైదారాబాద్ నుంచి కొడంగల్ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో చంద్రయ్యకు తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స నిర్వహిస్తుండగా ఆయన మృతి చెందాడు. మృతుని కుమారుడు యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

విధుల్లో ఉండగా గుండెపోటు

మిషన్ భగీరథ హెల్పర్ మృతి


మల్లయ్య(ఫైల్)

యాలాల: మిషన్ భగీరథలో వాటర్ సప్లయ్‌లో హెల్పర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పగిడియాల గ్రామానికి చెందిన పిట్ల మల్లయ్య(57) గతంలో గ్రామ వీఆర్‌ఏగా విధులు నిర్వహించేవాడు. అయితే ప్రభుత్వం వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించగా, మల్లయ్యకు మిషన్ భగీరథ పగిడియాల ప్లాంట్ వద్ద హెల్పర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఎప్పటిలాగే విధుల్లో ఉండగా, ఉదయం ఛాతిలో నొప్పి వస్తుందంటూ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే తాండూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

క్రీస్తు బోధనలతో ప్రపంచ శాంతి

మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల


కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అనంతగిరి: అన్ని మతాలను సమానంగా చూసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు శనివారం వికారాబాద్ పట్టణంలోని బసంత్ ఫంక్షన్ హాల్‌లో ప్రభుత్వ పరంగా నిర్వహించిన క్రిస్మస్ సంబురాల్లో పాల్గొని కానుకలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమన్నారు. క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగను శాంతియుతంగా, సంతోషంగా జరుపుకోవాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పాస్టర్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్ కట్ చేసి గిఫ్ట్‌లను అందజేశారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్ పటేల్, జెడ్పీ వైస్‌చైర్మన్ విజయ్‌కుమార్, ఆర్‌డీఓ విజయకుమారి, ఎంపీపీ చంద్రకళ, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎర్రవల్లి జాఫర్, రమేష్ కుమార్, తహసీల్దార్‌లు, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం

- అర్బన్ ఫారెస్టు కింద రూ.1.50 కోట్లతో పనులు
- పర్యాటక కేంద్రంగా కోట్‌పల్లి ప్రాజెక్టు
- చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు సైదులు


స్థలాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ సైదులు, ఇతర అధికారులు

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు పరిసర అటవీ ప్రాంతంలో అర్బన్ ఫారెస్టు కింద రూ.1.50 కోట్ల వ్యయంతో పర్యాటకులకు మౌలిక వసతులు కల్పిస్తామని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు(సీసీఎఫ్) సైదులు ప్రకటించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకే తలమానికమైన కోట్‌పల్లి ప్రాజెక్టును ఆయన శనివారం అటవీ అధికారులతో కలిసి పర్యటించారు. ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. అర్బన్ ఫారెస్టు ద్వారా కోట్‌పల్లి ప్రాజెక్టు, అనంతగిరిగుట్ట ప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు తగిన వసతులు కల్పిస్తామన్నారు. వసతుల కల్పనకు ఎంత వ్యయం అవుతుందనే అంశాలపై అధికారులతో ఆయన అంచనా వేశారు. ప్రాజెక్టుకు వచ్చే సందర్శకులు, వాహనాల సంఖ్యను జిల్లా అటవీ అధికారి జ్ఞానేశ్వర్, ధారూరు రేంజ్ ఇన్‌చార్జి డీఎఫ్‌ఓ కృష్ణలను అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియను త్వరలో పూర్తిచేస్తామని సీసీఎఫ్ సైదులు తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్దకు పర్యాటకులను అనుమతించే విషయం జిల్లా కలెక్టర్ పరిధిలో ఉందన్నారు.

అడవుల నరికివేత

ధారూరు ఫారెస్టు రేంజ్ పరిధిలో 20 వేల ఎకరాల అటవీ విస్తరించి ఉందని, అందులో అక్కడక్కడ చెట్లు నరికివేతకు గురవుతుందని విలేకరులు సీసీఎఫ్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా అడాల్‌పూర్, రాస్నం, గురుదోట్ల, అంపల్లి, బాణాపూర్, రుద్రారం, దోర్నాల్ అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికి పొలాలుగా మారుస్తున్నారని, వీటిపై చర్యలు తీసుకుంటారా అని ప్రశ్నించగా.. నరికిన లోకేషన్‌ను వాట్సాప్ గ్రూపుకు పంపిస్తే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సీసీఎఫ్ వెంట డీఎఫ్‌ఓ జ్ఞానేశ్వర్, డీఆర్‌ఓ జగన్‌మోహన్, ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ కృష్ణ, బీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి వెన్నెముక

- స్వామి వివేకానంద స్ఫూర్తితో ముందుకు నడవాలి
- ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

వికారాబాద్ అర్బన్: స్వామి వివేకానంద ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక బ్లాక్ గ్రౌండ్‌లో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా యువజన వారోత్సవాల్లో ఇరువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువత దేశ అభివృద్ధి కోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. యువశక్తి ఎంతో గొప్పదని ఉన్నతమైన భవిష్యత్తు కోసం కలలు కనాలన్నారు. ప్రభుత్వపరంగా యువతకు సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్సవాలలో భాగంగా స్థానిక అంబేడ్కర్ భవనంలో జిల్లా స్థాయి యువజన ఉత్సవాల నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జిల్లా యువజన క్రీడల అధికారి హనుమంతరావు, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ విశ్వాసమే ముఖ్యం

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

- వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

వికారాబాద్ అర్బన్: దివ్యాంగులు ఆత్మవిశ్వాసాన్ని నింపుకొని తమలో దాగి ఉన్న నైపుణ్యానికి వెలికి తీసి అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని మహిళా శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, మనోహర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. చదువు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పిస్తుందన్నారు. మానసిక స్థైర్యాన్ని కోల్పోకుండా అన్ని రంగాల్లో నైపుణ్యంతో ముందుకు సాగాలన్నారు. ఇక ముందు దివ్యాంగులకు ఇబ్బంది కలగకుండా సదరం క్యాంపులను వికారాబాద్, తాండూరులో నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉత్తమ పార్లమెంటేరియన్ దివంగత జైపాల్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరే అన్ని పథకాలను అమలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వపరంగా సహకరిస్తామన్నారు. వీరు సమాజంలో పోటీపడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం దివ్యాంగులకు ల్యాబ్‌టాప్‌లు, ట్రై సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, బీసీ కమిషన్ సభ్యులు శుభప్రద్ పటేల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, జడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఎంపీపీ చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు చేరువయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా నెర వేరుస్తుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, కుల్కచర్ల ఎంపీపీ సత్యహరిశ్చందర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షులు లాల్‌కృష్ణ, ఆనందం, నాయకులు హన్మంతు, కృష్ణ, పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కానుక అందజేత

పరిగి: క్రిస్మస్ పండుగకు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని తుంకల్‌గడ్డ చర్చిలో ఆయా గ్రామాల్లోని క్రైస్తవులకు క్రిస్మస్ కానుకను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యాలకు ప్రతీకగా క్రిస్మస్ పండుగ నిలుస్తుందన్నారు. కుల, మతాలకు అతీతంగా ఈ పండుగను జరుపుకోవాలని సూచించారు. నియోజకవర్గంలోని చర్చీల అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానన్నారు. క్రైస్తవులకు ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

పరిగి: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు చేసిన సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరవలేరని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పీవీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దేశ ప్రధానిగా ఎదిగిన గొప్ప నాయకుడు పీవీ అన్నారు. ఆయన ప్రధానిగా ఉండి దేశానికి ఎన్నో సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

అనుమతి తీసుకోకపోతే చర్యలు

నారాయణ స్కూల్ యాజమాన్యాన్ని హెచ్చరించిన డీఈఓ


స్కూల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈఓ రేణుకాదేవి

తాండూరు టౌన్: ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా గత మూడేళ్లుగా ఉన్నత తరగతులను కొనసాగిస్తున్న నారాయణ స్కూల్ యాజమాన్యంపై జిల్లా విద్యాధికారి రేణుకాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజుల్లో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోకపోతే క్రిమినల్ కేసు పెడతామని హెచ్చరించారు. శనివారం ఆమె తాండూరు పట్టణంలోని నారాయణ స్కూల్‌లో తనిఖీలు నిర్వహించారు. 8, 9, 10వ తరగతుల నిర్వహణ కోసం అనుమతి తీసుకోకుండా మూడేళ్లుగా అటు విద్యార్థులు కారుల కళ్లు గప్పి కొనసాగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో హుటాహుటిన డీఈఓ తనిఖీ చేపట్టారు. అనుమతి లేకుండా ఉన్నత తరగతులను నిర్వహిస్తున్నట్లు రుజువు కావడంతో అనుమతి కోసం దరఖాస్తును అందజేయాలని ఆమె ఆదేశించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. నారాయణ స్కూల్‌కు కేవలం 1 నుంచి 7వ తరగతి వరకే అనుమతి ఉందన్నారు. అక్రమంగా 8, 9, 10 తరగతులను కొనసాగిస్తున్నారన్నారు. దీనికి సంబంధించి ఈఆర్‌టీ అనుమతి కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలని లేకపోతే క్రిమినల్ కేసు నమోదు చేయడంతో పాటు పాఠశాలను సీజ్ చేస్తానని హెచ్చరించినట్లు చెప్పారు. ఈమేరకు స్కూల్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చే శామన్నారు.

మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలి

డ్రగ్స్, కల్తీ సరుకుల రవాణాపై కఠిన చర్యలు


సమావేశంలో తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్ రూరల్: మత్తు పదార్థాలు, కల్తీ సరుకుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ విజయకుమార్ కోరారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి తాగడంతో ఆరోగ్యాలు దెబ్బతింటాయని విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వీటి అక్రమ రవాణాపై పోలీసు విభాగం పటిష్ట నిఘాను ఏర్పాటు చేయాలన్నారు. గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ఎమ్మెల్యే శంకర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఎమ్మెల్యేకు టీజేఎంయూ నాయకుల వినతి

షాద్‌నగర్‌రూరల్: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్(టీజేఎంయూ) రాష్ట్ర నాయకుడు స్వాములయ్య కోరారు. శనివారం యూనియన్ నాయకులు ఎమ్మెల్యేగా ఎన్నికైన వీర్లపల్లి శంకర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వాములయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించినందుకు ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగిందని అన్నారు. డిపోకు ఆదాయం పెరగడం సంతోషంగా ఉందని, కానీ ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవని అన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం డిపోకు 20 బస్సులను పెంచి స్టాఫ్‌ను కేటాయించాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీజేఎంయూ నాయకులు పాషమియా, ఎస్‌జి.రావు, రవిచంద్ర, సుగుణమ్మ, రాములు, అక్బర్, కృష్ణుడు, మహేష్, సరస్వతి, జ్యోతి, నరసయ్య, శంకరయ్య, వరలక్ష్మి, శ్యామల, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారుతో బీభత్సం

ముగ్గురికి తీవ్ర గాయాలు


ప్రమాదానికి కారణమైన కారు

శంకర్‌పల్లి: మద్యం మత్తులో ఓ వ్యక్తి కారుతో బీభత్సం సృష్టించిన సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పత్తేపురం ఫ్లైఓవర్‌పై శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చందిప్ప గ్రామానికి చెందిన ప్రభాకర్(40) మద్యం తాగి మున్సిపల్ పరిధిలోని పత్తేపురం ఫ్లైఓవర్‌పై కారుతో రెండు బైక్‌లు, ఒక కారును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరి వ్యక్తులతో పాటు కారులో ఉన్న ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. నిందితుడు ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన

కొడంగల్ రూరల్: మండల పరిధి గ్రామాల్లోని ప్రభుత్వ స్థలాలను శనివారం అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు అధికారి రాంరెడ్డి, తహసీల్దార్ విజయకుమార్, సర్వే అధికారులు పరిశీలించారు. ఎక్కడ ఎంత భూమి ఉంది, ఏయే ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలల నిర్మాణాలు, మౌలిక వసతుల రూపకల్పనకు ఏ మేరకు ఉపయోగపడతాయనే అంశంపై సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు శివకుమార్, మురళీధరచారి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై రుణాలివ్వండి


డీసీసీబీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తుర్కయంజాల్: ప్రభుత్వం హక్కు పత్రాలు అందజేసిన భూములపై స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు ఇప్పించాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు ప్రతాప్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లచ్చిరెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్‌లు శనివారం డీసీసీబీ చైర్మన్ సత్తయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర సహకార బ్యాంకు ద్వారా ప్రభుత్వం హక్కులు కల్పించిన భూములపై గడిచిన 13 సంవత్సరాలుగా ఎలాంటి రుణాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గతంలో ప్రభుత్వాలు నిరుపేద కుటుంబాలకు, ఆ భూములపై హక్కు పత్రాలు ఇచ్చారు. కావునా, వాటిని పరిశీలనలోకి తీసుకుని రుణాలు మంజూరు చేయాలని కోరారు. రుణాలు ఇవ్వకపోవడం రైతులు అప్పులు చేయాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్ కుమార్‌గౌడ్, నర్సింహగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవునిఎర్రవల్లిలో అమ్మవార్లకు బోనాలు


దేవునిఎర్రవల్లిలో బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

చేవెళ్ల: దేవునిఎర్రవల్లిలో ఈదమ్మ, పోచమ్మ బోనాలు నిర్వహించారు. శనివారం గ్రామంలో నూతనంగా పునఃనిర్మాణం చేసిన ఈదమ్మ, పోచమ్మ ఆలయలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఊరేగింపులో పాల్గొన్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఆయా ఆలయాల్లో భక్తులు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, కాంగ్రెస్ నాయకుడు పి.వెంకటస్వామి పాల్గొన్నారు.

ట్రాఫిక్ అదాలత్‌ను వినియోగించుకోండి

రిటైర్డు జడ్జి సాంబశివరావు ● రెండో రోజు 220 కేసులకు పరిష్కారం


లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరిస్తున్న రిటైర్డు జడ్జి సాంబశివరావు, సీఐ సైదులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి

చేవెళ్ల: పెండింగ్ చలాన్లను వాహనదారులు లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని రిటైర్డు జడ్జి సాంబశివరావు పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కోర్టు ఆవరణలో శనివారం రెండో రోజు లోక్ అదాలత్ కొనసాగింది. రెండో రోజు 220 మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులను పరిష్కరించారన్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో వాహనదారులపై నమోదైన కేసులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. దీని కోసమే లోక్ అదాలత్ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. దీన్ని వాహనదారులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ లోక్ అదాలత్‌లో ట్రాఫిక్ సీఐ సైదులు, ఎస్‌ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది కవిత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ మోదీయే ప్రధాని: బీజేపీ నేత జనార్దన్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మో గించి మూడోసారి మళ్లీ నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బెక్కిరి జనార్దన్‌రెడ్డి జోస్యం చెప్పారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా కనకమామిడి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నక్కలపల్లి జంగారెడ్డి, పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.